# ఉపోద్ఘాతము

విద్యావిషయమందుగాని, విజ్ఞానమందుగాని వెనుకబడిన తమ పిల్లలను చూసి తల్లిదండ్రులెంత ఆవేదన పడుదురో, విచారమునకు గురియగుదురో, నైతిక, ఆధ్యాత్మిక, ధార్మికరంగాలలో వెనుకబడిన పసిబిడ్డలనుచూచి భరతమాత అంతకు వేయిరెట్లు ఆవేదన నొందును, విచారమున క్రుంగును. దేశమాత ప్రతిబింబమే దేహమాత. బింబ ప్రతిబింబములైన దేశ, దేహ మాతల పరితాపములను పారద్రోలునట్టి ప్రయత్నమునకు, విద్యార్థులే తగిన సమర్థులు. దేశమనగ మట్టి కాదు, మనుష్యులే. దేశమును తీర్చిదిద్దటమనగా ప్రజలను తీర్చిదిద్దుటయే. అనగా నేటి మానవులను నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక మార్గములందు సంస్కరింపజేయుట విద్యార్థులు ప్రప్రథమమున పట్టవలసిన ప్రధాన కార్యము.

ప్రజలను నైతిక, ఆధ్యాత్మిక మార్గముల సంస్కరింపజేయు శక్తిసామర్థ్యములు ప్రభుత్వమునకు లేవు. ఆధ్యాత్మిక దృష్ట్యా చూచిన ఇటు ప్రజలయందు కానీ, అటు ప్రభుత్వమందుగానీ సంస్కరణ సదుపాయములు కానరాకున్నవి. కారణమేమన బాల్యమునుండియూ తమ జీవితశిలను ఉత్తమ భవిష్యత్తునకు అనుగుణంగా మలచుకొనక పోవుటే. మానవుడు భావి పౌరసత్వమునకు అవసరమైన యోగ్యతను విద్యార్థి దశలో ఆర్జించుకొనకపోవుటే. జీవిత సౌధమునకు విద్యార్థిదశ పునాదివంటిది. ఈ రహస్యము గుర్తించి, వర్తించిన వారి భవిష్యత్తు మహాశక్తిమంతమైనదే కాక, ఆదర్శజీవితాధికారి కాగలరు. ప్రతి వ్యక్తి విలువ తన జీవితసంస్కరణపై ఆధారపడియుండును. భావిభారతోద్ధారకులు, పవిత్రచిత్తులు, నిర్మల హృదయులు అగు విద్యార్థులను రాజకీయరంగమునకు లాగి, వారి ప్రశాంతతను, పవిత్రతను చెదరగొట్టు కొందరు పైశాచిక వ్యక్తులు తమ స్వార్థమునకై కుయుక్తులు పన్ని విద్యార్థుల చిత్తవృత్తులను ఉన్మత్తమున, మత్తులుగా చేసి విద్యార్థుల కీర్తికి, వ్యాప్తికి భంగము కలిగించుచున్నందున, విద్యార్థుల క్రమశిక్షణ చెల్లాచెదరైనది. కాని, యివి విద్యార్థుల బుద్ధిపూర్వకములు కానేరవని, విద్యార్థులు స్వయముగా హద్దులు మీరువారు కారని నా సంపూర్ణవిశ్వాసము. విద్యార్థులు రాజకీయములకు, హృదయరంగమున స్థానమియ్యక సత్య, ప్రేమ, సహనములతో విచారణ సలిపి, నీతినిజాయతీలను మనోయంత్రమునకు అద్దములుగ అమర్చి తమ కర్తవ్యమును తాము నిర్వర్తించుకొనుచు, విద్య పూర్తి అయిన తదుపరి, తాము తెలుసుకున్న సత్యమును తాము స్వయముగ ఆచరణల యందుంచునవి, తాము మంచివని విశ్వసించిన వాటితో లోకములోని మానవులను తీర్చిదిద్దుటకు తగిన ప్రయత్నము సలుపవచ్చును. అట్లుకాక తమ దృష్టిని, శ్రవణమును పరుల దృష్టితో, శ్రవణములతో చేర్చి చూచిన, వినిన, తమకుతామే పతనమగుటయేకాక సమాజమునకు కూడను కీడు చేసినవారు కాగలరు. విద్యార్థుల సమస్యలకు తగిన కారణములను లోతుగ విచారణలు సలిపి దానికి తగిన రీతిలో తగిన వారలతోనే ఆ సమస్యలను తీర్చుకోవలెను. కాని అర్థములేని, విద్యారంగముతో యెట్టి సంబంధములేని వారలతో కూడి ఆడంబరమైన నినాదములు జరిపిన ప్రగతిని సాధించలేకపోవుటయేగాక పరులకు ఇక్కట్లు కలిగించి ఆస్తిపాస్తులు ధ్వంసము చేసినవారగుదురు. ఆస్తిని నాశముచేసిన అభ్యుదయమును పొందజాలము.

విద్యార్థులు పవిత్ర హృదయులగుటచే సత్యమును అతి సులువుగా గ్రహింతురను యథార్థము గుర్తించుటచే విద్యార్థులకు భారతీయ భాగ్యరత్నములైన ఆధ్యాత్మిక మూర్తుల చరిత్రలను సూత్రప్రాయంగ అందించ సంకల్పించితిని. విద్యార్థులన్న అమిత ప్రేమ, విశ్వాసములు కలిగియుండుటచేతనే కొన్ని విద్యాసంస్థలను, వేదశాస్త్రసంస్థలను స్థాపించి వాటిద్వారా నైతిక, భౌతిక, ఆధ్యాత్మిక మార్గములందు తగిన వ్యక్తిత్వమును తీర్చిదిద్ద మేము ప్రయత్నించుచున్నాము. విద్యార్థులు తమ జీవితమును తామే స్వయంగా సంస్కరించుకొనలేరు. ఇంటిలో తల్లిదండ్రులద్వారా, విద్యాలయములందు గురువులద్వారా కొంత ఆదర్శమును

అందించిన తమలోని సహజ శక్తిని మరింత శ్రద్ధతో అభివృద్ధి గావించుకొన వచ్చునను ఆశకూడను దీనికి ఒక ప్రధాన కారణము. మహనీయుల జీవిత అనుభూతులు, వారల యోగ్యమైన ఆచరణలు, సత్‌శీల ప్రభావములు, సహన, ప్రేమ, సామర్థ్యములు, దైవత్వముయొక్క విశాలత్వమును ఇందులోని పాత్రధారులు అందింతురు.